WWW.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

12-2-2025



## బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం

- స్థానిక ఎన్నికల్లో సత్తాచాటేలా శ్రేణులు కదలాలి
- బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే కేసీఆర్‌కు నిజమైన కానుక
- ప్రజా సమస్యలపై పోరాడి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- బంజారాహిల్స్‌లో బీఆర్ఎస్ నేతల కీలక సమావేశం
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ , మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు





## వేసవికి విద్యుత్ శాఖ సిద్ధం

- ఎండలు తాకె తడవుగా డిమాండ్ పెరుగుదల
- నిరంతర విద్యుత్ కోసం విప్లవాత్మక చర్యలు
- విపరీత డిమాండ్‌లోనూ అంతరాయం లేని సరఫరా లక్ష్యం
- సదుపాయాల విస్తరణతో వినియోగదారులకు భరోసా
- ఖమ్మం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ.సురేందర్

ఏటా వేసవి వచ్చిందంటే విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోతుంది. ఎండలు మండిపోతే ఫ్యాన్లు, కూలర్లు, ఎయిర్ కండీషనర్ల వాడకం పెరిగిపోవడం సహజం. అయితే, ఈసారి విద్యుత్ డిమాండ్‌కు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఖమ్మం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ.సురేందర్ స్పష్టం చేశారు.



## రైతుల గోస... కలెక్టర్ ఆగ్రహం

- రుణమాఫీపై అధికారులకు చీవాట్లు
- సన్న రకం బోనస్ తక్షణమే చెల్లించాలి
- పంట పొలాలకే వెళ్లి సమస్యలు విన్న కలెక్టర్
- గ్రామాభివృద్ధికి రోడ్లు, స్మశాన వాటిక మంజూరు

ముదిగొండ మండలంలోని గోకినేపల్లి గ్రామంలో మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆకస్మికంగా పర్యటించారు. రైతుల సమస్యలను నేరుగా విన్న కలెక్టర్, అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల

## మున్నేరు హైలెవల్ బ్రిడ్జిపై తిరిగి రాకపోకలు

- విషయాన్ని సమర్థవంతంగా చేతుల్లోకి తీసుకున్న మంత్రి
- సమస్య పరిష్కారంతో ప్రజల్లో హర్షాతిరేకాలు
- నేటి నుంచి ఖమ్మం నగరానికి బ్రిడ్జి లింక్ తిరిగి అందుబాటులో



గత సెప్టెంబర్ 1న మున్నేరు నది ఉధృతి కారణంగా దెబ్బతిన్న ప్రకాశ్ నగర్ హై లెవల్ బ్రిడ్జి మరమ్మత్తులు పూర్తయ్యాయి. వరద పోటు తట్టుకోలేక 9 స్పాన్స్ పక్కకు జరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రైతులు, ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు తీసుకున్న వెంటనే ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనులు వేగంగా పూర్తిచేయించారు. నేటి నుంచి ఈ మార్గంలో వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

ఖమ్మం, మహా



# వేసవికి విద్యుత్‌శాఖ సిద్ధం



**ఖమ్మం సిటి, ఫిబ్రవరి 11 , మహా:** ఏటా వేసవి వచ్చిందంటే విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోతుంది. ఎండలు మండిపోతే ఫ్యాన్లు, కూలర్లు, ఎయిర్ కండీషనర్ల వాడకం పెరిగిపోవడం సహజం. అయితే, ఈసారి విద్యుత్ డిమాండ్‌కు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఖమ్మం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ.సురేందర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 10న 15,998 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైతే, ఖమ్మం సర్కిల్‌లో ఫిబ్రవరి 6న 8.26 మిలియన్ యూనిట్లు డిమాండ్‌ను దాటిందని తెలిపారు. ఈ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని వివరించారు.

### గణనీయంగా పెరిగే డిమాండ్ - విద్యుత్ శాఖ వ్యూహాత్మక సమయోచిత చర్యలు

వేసవి కాలంలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, విద్యుత్ సరఫరా లోపం ఏర్పడకుండా ముందస్తుగా తగిన చర్యలు చేపట్టినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ వెల్లడించారు. గత మూడు నెలలుగా వేసవి ప్రణాళికను రూపొందించి, క్రమంగా మౌలిక సదుపాయాలను విస్తరించామని వివరించారు. ఇందులో భాగంగా:

**170 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు**
**65 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు**
**14 కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాపన**
**పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య విస్తరణ**

దీంతోపాటు, విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఉండేందుకు కీలక ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

### ఇంటర్ లింక్ లైన్లు - విద్యుత్ అంతరాయం లేకుండా మాస్టర్ ప్లాన్

ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర నిర్వహణ, లేదా ఏదైనా ఇతర కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఆ ప్రాంత వినియోగదారులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేకంగా 35 కొత్త ఇంటర్ లింకింగ్ లైన్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ ఇంటర్ లింక్ వ్యవస్థ ద్వారా ఒక లైన్‌లో సమస్య వస్తే మరొకటి ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని, అవసరాన్ని బట్టి కొత్త ఫీడర్లను కూడా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

### ఫిబ్రవరి చివరికల్లా పనుల పూర్తి -వేసవికి విద్యుత్ శాఖ సిద్ధం!

వేసవి సమీపిస్తుండటంతో విద్యుత్ వినియోగం మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నామని, ఫిబ్రవరి చివరికల్లా అన్ని మౌలిక సదుపాయాల పనులను పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవడం వల్ల విద్యుత్ శాఖ తగిన ఏర్పాట్లు చేసుకునే వీలుపడిందని, ఎలాంటి అంతరాయాలు లేకుండా వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వివరించారు.

**రాబోయే మూడు నెలల్లో విద్యుత్ వినియోగం రికార్డుల మించే అవకాశం**

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుండగా, రాబోయే మూడు నెలల్లో మరింత పెరిగే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అంచనా వేస్తోంది. దీంతో ముందస్తుగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అన్ని చర్యలు తీసుకుందని పేర్కొన్నారు.

**విద్యుత్ ఆదా చేయడం అలవాటు చేసుకోవాలి**

వినియోగదారులు అవసరానికి మించి విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని, ముఖ్యంగా ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అవసరం లేనప్పుడు అధిక లోడ్ పరికరాలను తగ్గించాలని సూచించారు. ఇలాంటి సమయాల్లో వేడి పరికరాల వాడకాన్ని తగ్గించడం, అవసరానికి మించి విద్యుత్ వినియోగించకపోవడం ద్వారా ఉత్పత్తి, సరఫరా మధ్య సమతుల్యత సాధించవచ్చని విద్యుత్ శాఖ తెలిపింది.

**విద్యుత్ శాఖ అప్రమత్తం**

ఈ వేసవిలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగే అవకాశం ఉండడంతో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. వేసవి కాలం ఎలాంటి విద్యుత్ అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు తీసుకుంటోంది. కీలక ఏర్పాట్లతో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరఫరా కొనసాగించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. వినియోగదారులు కూడా విద్యుత్ ఆదా చేసేలా మెలగాలని, ఎండల కాలంలో ఆచరణలో పెట్టవలసిన సూత్రాలను పాటించాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేసింది.



# రైతుల గోస... కలెక్టర్ ఆగ్రహం

- రుణమాఫీపై అధికారులకు చీవాట్లు
- సన్న రకం బోనస్ తక్షణమే చెల్లించాలి
- పంట పొలాలకే వెళ్లి సమస్యలు విన్న కలెక్టర్
- గ్రామాభివృద్ధికి రోడ్లు, స్మశాన వాటిక మంజూరు



**ముదిగొండ, ఫిబ్రవరి 11, మహా:** ముదిగొండ మండలంలోని గోకినేపల్లి గ్రామంలో మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆకస్మికంగా పర్యటించారు. రైతుల సమస్యలను నేరుగా విన్న కలెక్టర్, అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకుల నిర్లక్ష్యం వల్ల రైతుల రుణమాఫీ నిలిచిపోవడంతో, "మీ డబ్బులు రాకపోతే ఊరుకుంటారా?" అంటూ మండల వ్యవసాయ అధికారిని, ఏఈఓను నిలదీశారు.

### రుణమాఫీపై కలెక్టర్ ఆగ్రహం

రైతులకు రుణమాఫీ అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులను కఠినంగా ప్రశ్నించిన కలెక్టర్, లీడ్ బ్యాంకు మేనేజర్‌ను తక్షణమే కాల్ చేసి సమస్య పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. "రైతుల డబ్బు వేరే ఖాతాల్లో జమ చేయడం మానండి ఒక్కరికి కూడా అన్యాయం జరగకూడదు" అని స్పష్టం చేశారు.

### సన్న రకం బోనస్

ఖమ్మం జిల్లాలో 140 కోట్ల రూపాయల సన్న రకం బోనస్ చెల్లించినట్లు తెలిపారు. ఇంకా పెండింగ్ ఉన్న రైతుల వివరాలను వెంటనే సేకరించి, వారందరికీ తక్షణమే చెల్లించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. "రైతుల కష్టార్జిత ధాన్యం కోసం నెలల తరబడి వేచిచూడొద్దు" అంటూ కఠిన హెచ్చరికలు చేశారు.

### గ్రామ అభివృద్ధి

గ్రామానికి చెందిన 3,000 మంది ప్రజలకు ఒకే స్మశాన వాటిక ఉండటం దారుణమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కొత్త స్మశాన వాటిక నిర్మాణానికి పంచాయతీ తీర్మానం తీసుకుంటే వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేందుకు రెండు మట్టి రోడ్లను తక్షణమే నిర్మించి, త్వరలో పక్కా రోడ్లు వేయాలని అధికారులను ఆదేశించారు.

### పశుసంవర్ధన పాల ఉత్పత్తిపై దృష్టి

పాల ఉత్పత్తి పెంచేందుకు రైతులు పశువులకు మెరుగైన మేత అందించాలన్నారు. కొవ్వు శాతం అధికంగా ఉండే విధంగా మేత పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. రైతులు అధునాతన వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక లాభం పొందాలని సూచించారు.

### అధికారుల తీరుపై నిఘా

రైతుల సమస్యలను పరిశీలించేందుకు అధికారులు కార్యాలయాల్లో కూర్చోకుండా నేరుగా గ్రామాల్లోకి వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల రుణమాఫీ, బోనస్, బ్యాంకు సమస్యలపై సంబంధిత శాఖలు తక్షణమే స్పందించాలి. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏ.ఓ., ఏ.ఈ.ఓ., రెవెన్యూ అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం



**ఖమ్మం , ఫిబ్రవరి 11 , మహా:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసంలో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

### స్థానిక ఎన్నికల్లో పింక్ జెండా ఎగరాలని పిలుపు

ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ ఎన్నికల్లో విజయాన్ని సాధించి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుభవార్త అందించాలన్నారు.

### పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమిష్టిగా కృషి

బీఆర్ఎస్ శ్రేణులు అన్ని వర్గాల ప్రజలకు చేరువై, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యూహాలను ఖచ్చితంగా అమలు చేసి బీఆర్ఎస్ ప్రాబల్యాన్ని మరింత బలపర్చాలని సూచించారు.

### ఖమ్మం రాజకీయం - కీలక చర్చ

సమావేశంలో ఖమ్మం నియోజకవర్గ తాజా రాజకీయ పరిణామాలను ప్రముఖంగా చర్చించారు. పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలను కార్యాచరణగా రూపొందించామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు సాగి ఎన్నికల్లో విజయాన్ని సాధించాలన్నారు.

### సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

**ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, బొమ్మెర రామ్మూర్తి, ఖమ్మం కార్పొరేషన్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాక్బుల్, ఖమ్మం టౌన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు వీరునాయక్, కార్పొరేటర్లు, మండల, కార్పొరేషన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**

# బాలుడి పరామర్శలో రాజకీయ ఆసక్తి



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 11, మహా:** అగ్నిప్రమాదంలో గాయపడిన జనసేన పార్టీ అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఉమాదేవి కుమారుడిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం పరామర్శించారు. అయితే, ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అసంతృప్త నేత, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వరరావు హాజరుకావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. వివిధ పార్టీల్లో కొనసాగిన తాటి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. అలాంటిది, ఆయన జనసేన ఎమ్మెల్యేతో కలిసి పరామర్శకు రావడంతో కొత్త ఊహాగానాలకు తావిస్తోంది. తాటి మళ్లీ పార్టీ మారతారా? ఆయన తదుపరి రాజకీయ ప్రయాణం ఏదో అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ పరామర్శలో జనసేన పార్టీ నాయకులు గడ్డమునుగు రవి, దేగల రాము, పసుపులేటి రాము తదితరులు పాల్గొన్నారు.



# మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల

## మున్నేరు హైలెవల్ బ్రిడ్జిపై తిరిగి రాకపోకలు

**గత సెప్టెంబర్ 1న మున్నేరు నది ఉధృతి కారణంగా దెబ్బతిన్న ప్రకాశ్ నగర్ హై లెవల్ బ్రిడ్జి మరమ్మత్తులు పూర్తయ్యాయి. వరద పోటు తట్టుకోలేక 9 స్పాన్స్ పక్కకు జరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రైతులు, ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు తీసుకున్న వెంటనే ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనులు వేగంగా పూర్తిచేయించారు. నేటి నుంచి ఈ మార్గంలో వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభం కానున్నాయి.**

ఖమ్మం, మహా

### వరద ధాటికి బ్రిడ్జి ధ్వంసం - జనజీవనం అస్తవ్యస్తం

సెప్టెంబర్ నెలలో మున్నేరు నది భయంకరంగా ఉప్పొంగింది. వరద ప్రభావంతో ప్రకాశ్ నగర్ హై లెవల్ బ్రిడ్జి నడిమధ్యలో 9 స్పాన్స్ దెబ్బతిన్నాయి. వాహనదారులు బ్రిడ్జిని దాటేందుకు వీలు లేకుండా పోయింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్న రైతాంగం ఇతర మార్గాల్లో వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో స్పీడ్ వర్క్

బ్రిడ్జి మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాలని మంత్రి తుమ్మల సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, డిస్ ప్లేస్ అయిన స్పాన్స్‌ను తిరిగి యథాస్థితిలోకి తీసుకువచ్చే పనిని వేగంగా పూర్తి చేశారు. అతి తక్కువ సమయంలోనే అన్ని పనులు పూర్తయ్యాయి.

### రైతాంగానికి బ్రిడ్జి ఎంత ప్రాముఖ్యతో...

ప్రకాశ్ నగర్ బ్రిడ్జి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానమై ఉంది. ఈ మార్గం ద్వారా రోజూ వందలాది రైతులు పంట ఉత్పత్తులు తీసుకువస్తారు. బ్రిడ్జి లేకపోవడంతో రైతులు వంద కిలోమీటర్ల మేర అడ్డదారులు వెతుక్కోవాల్సి వచ్చింది. ఈ సమస్యకు తుమ్మల ప్రభుత్వం తెరదించడంతో రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

### నేటి నుంచి రాకపోకలు ప్రారంభం -మంత్రి పరిశీలన

బ్రిడ్జి పనులు పూర్తయిన నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పరిశీలించారు. నిర్మాణ నాణ్యత, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను సమీక్షించారు. నేటి నుంచి వాహనాల రాకపోకలను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. "ప్రకాశ్ నగర్ వాసులు, రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను అర్థం చేసుకుని అత్యవసరంగా పనులు వేగంగా పూర్తి చేశాం. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధ్యేయం." – మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

మహా పత్రిక
ANN తెలుగు




# కేటీఆర్‌ను కలిసిన మదన్‌లాల్

**కారేపల్లి ,ఫిబ్రవరి 11, మహా:** ఈరోజు హైదరాబాదులో ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో వైరా మాజీ శాసనసభ్యులు వైరా నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి భానోత్ మదన్ లాల్ పాల్గొన్నారు నియోజకవర్గం పార్టీ అభివృద్ధి గురించి రానున్న స్థానిక ఎన్నికల గురించి చర్చించడం జరిగింది కేటీఆర్ మాట్లాడుతూ వైర నియోజవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని కొంతమంది మూరు?ల వల్ల వైరా నియోజకవర్గంలో మనం ఓడిపోయామని గుర్తు చేశారు, ఏది ఏమైనా వైరా నియోజకవర్గానికి సరైన నాయకుడు మదన్ లాల్ అని కొని ఆడారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చూపియ్యాలని మదన్ లాల్ కు అన్నారు వైరా నియోజకవర్గంలో ఏమైనా ఇబ్బంది ఉంటే మదన్ లాల్ కి సమాచారం ఇవ్వాలని ఈరోజు నుండి మదన్ లాల్ నియోజకవర్గంలోనే ఉంటారని ఆయన తెలిపారు




# ప్రతి కార్యకర్త కష్టపడాలి

- స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి!
- కార్యకర్తల సమయస్ఫూర్తితో విజయాన్ని సొంతం చేసుకోవాలి
- కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రజలకు వివరించాలి
- నియోజకవర్గ కన్వీనర్ మానే రామకృష్ణ

**భద్రాచలం , ఫిబ్రవరి 11, మహా:** భద్రాచలం నియోజకవర్గంలో బిఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజల్లో బలమైన మద్దతును సంపాదించి గులాబీ జెండా ఎగరాలని నియోజకవర్గ కన్వీనర్ మానే రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ బలాన్ని చూపించేందుకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

### కాంగ్రెస్ పాలనలో తీవ్ర వైఫల్యాలు

భద్రాచలం మండల బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం మండల కన్వీనర్ ఆకోజు సునీల్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మానే రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వం తీరును గమనిస్తున్నారని, తమ భవిష్యత్తును తిరిగి బీఆర్ఎస్ చేతిలో అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అధికారంలో ఉన్న పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడంతో, రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పబోతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

### నియోజకవర్గాన్ని గెలిపించే లక్ష్యం

ఈ ఎన్నికలలో ప్రతి బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ ఆశయాలతో ముందుకు సాగాలనే సంకల్పంతో పని చేయా లని, నెగ్గే బలమైన వ్యూహంతో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని సూచిం చారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేయాలని ప్రజలకు వివరించి, పార్టీ విజయాన్ని ఖచ్చితం చేయా లన్నారు.

# మిర్చి రైతుల గోస.. ప్రభుత్వ నిర్లక్ష్యం

**ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 11, మహా:** రైతులు పండించిన పంటకు తగిన ధర దక్కక, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న దుస్థితిని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు.




మంగళవారం సుందరయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మిర్చి రైతులు ఆర్థికంగా కుంగిపోయారని, గిట్టుబాటు ధర లేక రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది తెగుళ్ల దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఒక ఎకరానికి ?2 లక్షల పెట్టుబడి పెట్టినా ఆశించిన ధర దక్కడం లేదన్నారు. గతేడాది ఇదే సమయంలో క్వింటా ?23,000 పలికితే, ప్రస్తుతం ?13,000 మాత్రమే పలుకుతోందని పేర్కొన్నారు. నాణ్యత సరిగ్గా లేదనే పేరుతో వేలాది టన్నుల మిర్చిని ?6,000 %- ?%8,000 ధరకు కొనుగోలు చేస్తుండటం దారుణమని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో గడిచిన వారం రోజుల్లోనే ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని నున్నా నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గార్ల మండలం సీతంపేటలో రైతు బాణోత్ ధర్మా మార్కెట్‌లో తన పంటకు తక్కువ ధర రావడంతో గుండెపోటుకు గురై మృతిచెందాడని తెలిపారు. రఘునాథపాలెం మండలంలో మాధవరావు, కోటపాడు గ్రామానికి చెందిన భూపతిరావు తీవ్ర మానసిక వేదనతో ప్రాణాలు తీసుకున్నారని వివరించారు.

# అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఖమ్మం విజయం

**ఖమ్మం సిటి , ఫిబ్రవరి11,మహా:** తెలంగాణ కరాటే ప్రతిభను ప్రపంచానికి చాటిన ఘనత ఖమ్మం జిల్లా సీనియర్ కరాటే మాస్టర్ కరాటే వేణు, ఆయన కుమారుడు మోదుగు అభిషేక్‌కు దక్కింది. హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 4వ ఇంటర్నేషనల్ ఓపెన్ టూ ఆల్ స్టైల్స్ కరాటే , కుంగ్ ఫు ఛాంపియన్షిప్ - 2025 పోటీల్లో ఈ తండ్రీకొడుకులు అద్భుత ప్రదర్శన చేసి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు.



### ఖమ్మం కరాటే విజయం - అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ప్రతిభ

'న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అంతర్జాతీయ పోటీల్లో నేపాల్, భూటాన్, శ్రీలంకతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 3000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎన్నో రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన పోటీదారుల మధ్య ఖమ్మం కరాటే మాస్టర్ వేణు, ఆయన కుమారుడు అభిషేక్ తమ అసాధారణ ప్రతిభతో అదరగొట్టి స్వర్ణ పతకాలను దక్కించుకున్నారు.

### వేణుకు ఛాంపియన్షిప్ - అభిషేక్ అదరగొట్టిన ప్రదర్శన

సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో కరాటే మాస్టర్ వేణు తన అసమాన నైపుణ్యం ప్రదర్శించి ఛాంపియన్‌గా నిలిచారు. అనేకమంది పోటీదారులను ఓడించి స్వర్ణ పతకం, గోల్డ్ సర్టిఫికెట్, ఛాంపియన్షిప్ %-% 2025 అవార్డు అందుకున్నారు. ఆయనకు ఈ ఘనతను సినీ నటుడు భానుచందర్ చేతుల మీదుగా బహుకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### వేణు, అభిషేక్‌కు ఘన స్వాగతం

ఈ విజయవంతమైన ప్రదర్శన అనంతరం వేణు, అభిషేక్ ఖమ్మం చేరుకోగానే శిష్యులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఇతర క్రీడాకారులకు వీరి విజయం మార్గదర్శకంగా నిలుస్తుందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

# పకడ్బందీగా ఎన్నికలు..!



- హ్యాండ్ బుక్ నిబంధనలు పూర్తిగా తెలుసుకోండి
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో కఠిన చర్యలు తప్పవు
- రిటర్నింగ్ అధికారులు పొరపాటుకు తావివ్వద్దు
- పోలీస్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ
- జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్

**ఖమ్మం, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికలను పట్టుదలతో, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల %-% 2025 శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు సమగ్ర మార్గదర్శకాలను వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి కలెక్టర్ ఇందులో పాల్గొన్నారు.

### ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారికి పూర్తి అవగాహన అవసరం

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపం చోటుచేసుకోకుండా పకడ్బందీగా వ్యవహరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. హ్యాండ్‌బుక్ నిబంధనలను పూర్తిగా చదివి అవగాహన పెంచుకోవాలని, అనుభవం ఉన్నప్పటికీ కొత్త మార్గదర్శకాలపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ నుంచి ఓటింగ్ వరకు ప్రతి దశలో నియమాలను కచ్చితంగా పాటించాలి. ఓటర్ల జాబితా ప్రచురణ, నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన,



తిరస్కరణ, గుర్తుల కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్ జారీ వంటి ప్రతి దశలోనూ పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తప్పనిసరి


ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో కఠిన చర్యలు తప్పవు, ఓటర్లను ప్రలోభపెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఏ అభ్యర్థి చర్యకైనా చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. రిటర్నింగ్ కార్యాలయ పరిధిలో రాజకీయ ర్యాలీలు, వాహన ప్రచారం నిషేధం విధించాల్సిన బాధ్యత అధికారులదే అని గుర్తుచేశారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ప్రతి అభ్యర్థితో పాటు ఇద్దరు ప్రతిపాదితులకే అనుమతి, నామినేషన్‌లో అభ్యర్థి వయస్సు, కుల ధృవీకరణ, సంతకాలు, పూర్తి వివరాల నమోదు ఖచ్చితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వివరించారు. రిజర్వ్ కేటగిరీ అభ్యర్థుల నామినేషన్లు కుల ధృవీకరణ పత్రం లేకపోతే తిరస్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### ఎన్నికల నిర్వాహణలో సమయపాలన అత్యంత కీలకం

ప్రతి దశలో అధికారుల సమయపాలన తప్పనిసరి, రిటర్నింగ్ అధికారులు రోజువారీ నామినేషన్ వివరాలను కచ్చితంగా పంపాలని, నామినేషన్ల స్వీకరణ ముగిసిన తర్వాత తదుపరి ప్రక్రియలు నిర్దేశించిన సమయానికే పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతే ముఖ్యమైందని, ప్రిసైడింగ్ అధికారులు తమ బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలనీ కలెక్టర్ సూచించారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారాలకు తావులేకుండా అధికార యంత్రాంగం సమర్థంగా వ్యవహరించాలని వివరించారు.

### భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలి

పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ అందించాల్సిన బాధ్యతను అధికారులే నెరవేర్చాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ఆర్డీఓలు నరసింహారావు, ఎల్. రాజేందర్, డి.ఎల్.పి.ఓ రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కవితను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్జేసి కృష్ణ

## బీసీ కులగణనపై విశ్లేషణ - ప్రభుత్వం తీరుపై చర్చ



**ఖమ్మం , ఫిబ్రవరి11, మహా:** జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులగణన నివేదికపై ఇద్దరూ సమగ్రంగా చర్చించారు.

### కులగణన నివేదికపై ఆగ్రహం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బీసీ కులగణన నివేదిక బీసీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని గుండాల కృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ గణనలో కీలకమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, బీసీ వర్గాల విభజన సరిగ్గా చేయకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ పార్టీ వైఖరిపై చర్చ

బీసీల హక్కుల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీ తీసుకోవాల్సిన చర్యల గురించి గుండాల కృష్ణ, కవితతో చర్చించారు. బీసీ వర్గాల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీ ఏ విధంగా ముందుకు సాగాలో చర్చించారు.

### బీసీల హక్కుల కోసం పోరాటం

కులగణన ప్రక్రియ సమగ్రంగా, నిజాయితీగా సాగాల్సిన అవసరం ఉందని గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ కోసం అన్ని రాజకీయ వర్గాల సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్నారు. బీసీల ప్రగతికి, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానం అవలంబించాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ ఈ అంశంపై తగిన నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తమైంది.

# తాతా మధుకు బోనాలతో ఘన స్వాగతం

**కారేపల్లి, ఫిబ్రవరి 11,మహా:** ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్సీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పిలుపునిచ్చారు.మండల పరిధిలోని కొత్త తండా గ్రామంలో గత ఏడాది నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్తులంతా కలిసి ఘనంగా నిర్వహించారు.ప్రముఖ పురోహితుడు సురేష్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవ పూజలకు ఎమ్మెల్సీ తాత మధు హాజరై ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.ముందుగా గ్రామానికి చేరుకున్న తాత మధుకు స్థానిక మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం గ్రామస్తులతో కలిసి ఊరేగింపులో .నిర్వాహణ కమిటీ సభ్యుడు, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్-అచ్చమ్మ దంపతులు ఎమ్మెల్సీ తాత మధు తోపాటు అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తోటకూరి పిచ్చయ్య,ముత్యాల వెంకట అప్పారావు,ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య,నాయకులు బానోత్ దేవ్లా నాయక్,అడప పుల్లారావు,ధరావత్ పాండ్యా నాయక్,చాగంటి కోటయ్య, మండిపూడి కోటి,మాజీ ఎంపీటీసీ ధరావత్ అచ్చమ్మ,నిర్వహణ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు భూక్య బాలాజీ,అజ్మీర శంకర్, బాదావత్ రాందాస్,తేజావత్ సంతు, బాధావత్ శ్రీను,రమేష్,అజ్మీర సక్రు, మాలోతు మొహన్ తదితరులు పాల్గొన్నారు.





## ఫెర్టిలిటీ క్యాంపును పరిశీలించిన ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట/దమ్మపేట, ఫిబ్రవరి 11, మహా:** గండుగులపల్లి పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెర్టిలిటీ క్యాంపును ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరిశీలించారు. పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధులతో పాటు ఎదకురాని పశువులను గుర్తించి టీకాలు అందిస్తూ పాల దిగుబడిని పెంచే లక్ష్యంతో ఈ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇటీవల కోళ్లకు ప్రాణాంతక వ్యాధులు పెరిగిపోతున్న తరుణంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధిని నియంత్రించేందుకు తగిన మందులు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు తేజారాణి, శ్యాంబాబు, ప్రశాంత్, గోపాలమిత్రసభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యం పై దృష్టి సారిద్దాం




**ఖమ్మం టౌన్, ఫిబ్రవరి 11 , మహా:** ప్రజారోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆర్. కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం నగరంలోని ప్రముఖ రెస్టారెంట్ల యజమానులతో ఈకోనోవా ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ వాడిన వంట నూనెను బయో డీజిల్‌గా మార్చడం ద్వారా ఆరోగ్యానికి కలిగే ముప్పును నివారించవచ్చని వివరించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన 'రూకో' పథకం ద్వారా వాడిన నూనె సేకరణతోపాటు ఆరోగ్య ప్రమాదాలను తగ్గించవచ్చని తెలియజేశారు. పునర్వినియోగానికి పనికిరాని వంట నూనెను తిరిగి వాడటం వల్ల క్యాన్సర్, మతిమరుపు వంటి వ్యాధులు ఉత్పన్నమయ్యే అవకాశముందని హెచ్చరించారు. ఈ సమావేశానికి సంస్థ నిర్వాహకుడు కొండా సాయినాథ్ శిక్షణ, భద్రతాధికారి శరత్ కుమార్, పోలాస్ యజమాని పోలా శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామారావు, రెస్టారెంట్ యజమానులు నరసింహారావు, సిబ్బంది దీక్షిత్, రవితేజ, వర్మ, వివేక్, ప్రీతం, మధు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పీఎంఏవై -జీ వివరాలేంటి?

### ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి



**ఖమ్మం, ఫిబ్రవరి 11, మహా:** తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ ( పీఎంఏవై -జీ ) పై కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలు ఏమిటని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి.. లోక్ సభలో మంగళవారం ప్రశ్నించారు. గత మూడేళ్లలో కేటాయించిన నిధుల వివరాలను అడిగారు. దీనికి కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ (పీఎంఏవై -జీ ) పథకం ద్వారా 2016 -17, - 18 ఆర్థిక సంవత్సరాల్లో 70,674 గృహాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు తొలి విడతలో రూ.190. 79 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. గత రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయలేదని, దీంతో ఆ ప్రభుత్వానికి నిధుల కేటాయింపు నిలిపివేసినట్లు తెలిపారు.

## తిరుపతమ్మ తల్లి స్వాముల ఇరుముడి మహోత్సవం



**కారేపల్లి, ఫిబ్రవరి 11 ,మహా:** సింగరేణి మండల పరిధిలోని బిక్య తండా సమీపంలో శ్రీ తిరుపతమ్మ తల్లి స్వాముల ఇరుముడి కార్యక్రమ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది అనంతరం ఆలయ ధర్మకర్త అజ్మీర కృష్ణ నాయక్ హరప్పా దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీశ్రీశ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామివారి కళ్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ నాయకులు బానోత్ రామ్మూర్తి నాయక్, గుగులోతు బీముడు, బానోతు రాములు తదితరులు పాల్గొన్నారు..




# మధిరపై వివక్ష

- పద్మావతి, మహబూబ్ నగర్ రైళ్ల హాల్టింగ్ రద్దు
- ప్రయాణికుల అసౌకర్యంపై నిరసనలు
- ఆగని రైళ్లు, పెరిగిన ప్రయాణ భారాలు
- రైల్వే అధికారుల నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత

**మధిర, ఫిబ్రవరి 11 ,మహా:** మధిర రైల్వే స్టేషన్‌పై రైల్వే శాఖ వివక్ష కొనసాగుతూనే ఉంది. నియోజకవర్గ కేంద్రమైన మధిరలో పద్మావతి (12763), మహబూబ్ నగర్ (12861) ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను రైల్వే శాఖ మరోసారి రద్దు చేసింది. మధిర నుంచి తిరుపతికి వెళ్లే పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కి మధిరలో నిలిపివేత ఉన్నప్పటికీ, తిరుపతి నుంచి వచ్చే అదే రైలు మధిరలో ఆగడం లేదు. విశాఖపట్నం %-% మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు మధిరలో ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌కు తర్వాత జిల్లా వ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యమైన మధిర స్టేషన్‌కు రైళ్ల హాల్టింగ్ తగ్గించడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. మధిర పరిధిలోని 100 గ్రామాలకు పైగా ప్రజలు ఈ రైల్వే స్టేషన్ ద్వారా ప్రయాణం సాగిస్తుంటారు. కోవిడ్ అనంతరం పలు రైళ్ల హాల్టింగ్ పునరుద్ధరించినప్పటికీ, మధిరకు మాత్రం వర్తింపజేయలేదు. గతంలో మధిరలో ఆగిన గౌతమి ఎక్స్‌ప్రెస్ (12738, 12737), సింహపురి ఎక్స్‌ప్రెస్ (12719, 12709), లక్నో ఎక్స్‌ప్రెస్ (15024, 15023) రైళ్ల హాల్టింగ్‌ను తొలగించారు. ఇంతకుముందు ఎంపీగా ఉన్న నామా నాగేశ్వరరావు మధిరలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (12655, 12656) హాల్టింగ్ కల్పిస్తానని హామీ ఇచ్చినా, ఇప్పటికీ అమలు కాలేదు.

### ప్రయాణికుల ఆగ్రహం

రైల్వే శాఖ నిర్ణయాలపై ప్రయాణికుల ఆగ్రహం పెరుగుతోంది. మధిర కంటే చిన్న స్టేషన్లలో రైళ్లు ఆగుతుండగా, ఇక్కడ మాత్రం నిలిపివేత లేకపోవడం పట్ల ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాజీపేట – తిరుపతి కొత్త రైలు (07091, 07092) మధిరను పక్కనపెట్టి, ఆదాయంలో తక్కువ ఉన్న కేసముద్రం, నెక్కొండ స్టేషన్లలో ఆగడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రతిరోజూ లక్షన్నరకు పైగా ఆదాయం వస్తున్న మధిర స్టేషన్‌కు మరిన్ని రైళ్లు ఆపితే, ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించడంతో పాటు రైల్వే శాఖ ఆదాయ వృద్ధి సాధించవచ్చు. మధిర నుంచి అనేక ప్రయాణికులు ఖమ్మం, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, చెన్నై, ఢిల్లీ ప్రాంతాలకు తరచుగా ప్రయాణిస్తుంటారు. అయినా ఇక్కడ రైళ్ల హాల్టింగ్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదు.

# ఏజెన్సీ గ్రామాలకు అండగా ఉంటాం

### మావోయిస్టు ప్రభావిత గ్రామాల యువత క్రీడల్లో రాణించాలి



**చర్ల ,మహా:** బీసిఆర్‌పిఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ కింద క్రీడా పోటీని నిర్వహించారు. తిప్పాపురం క్యాంప్‌లో సిఆర్‌పిఎఫ్ మరియు టిక్లర్ గ్రామ జట్టు మధ్య సిఆర్‌పిఎఫ్ సి/218 బెటాలియన్ వాలీబాల్ మరియు బ్యాడ్మింటన్ స్నేహపూర్వక మ్యాచ్‌ను నిర్వహించారు. సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సందీప్ మాట్లాడుతూ... గ్రామస్తులు మరియు పోలీసు బలగాల మధ్య మెరుగైన సంబంధాలు ఏర్పడటానికి మరియు నక్సల్ ప్రభావిత ప్రాంతం నుండి మంచి ఆటగాళ్లను ముందుకు తీసుకురావడానికి సిఆర్‌పిఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ కింద ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉంటున్నారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ గౌరవ సూచకంగా క్రీడాకారులకు టవల్స్, వాలీబాల్, వాలీబాల్ నెట్ మరియు ఇతర క్రీడా సామగ్రిని పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ లోకేంద్ర సింగ్, నితేష్ కుమార్, పామేడ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ మింజ్ మరియు ఇతర జవాన్లు పాల్గొన్నారు.



# నిద్రిస్తున్న నిఘానేత్రం

- మండలంలో కరువైన పర్యవేక్షణ
- ప్రధాన కూడళ్లు, రోడ్ల వెంట నిరుపయోగంగా ఉన్న వైనం..
- పట్టించుకోని అధికారులు
- పెరుగుతున్న వరుస దొంగతనాలు....
- గతంలో ఎన్నో కేసులకు...
- ఉపయోగపడిన సీసీ కెమెరాలు
- త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు
- ఇప్పటికైనా అధికారులు సీసీ కెమెరాల నిర్వహణ చేపట్టేనా ?



**ఏ క్షణంలో ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ప్రతి క్షణాన్ని వీడియోలు నిక్షిప్తం చేసేలా ఏర్పాట్లుంటే, ఎలాంటి ప్రమాదాలు జరిగినప్పుడైనా విశ్లేషించడం సులబతరం అవుతుంది. పోలీసు విచారణకు సీసీ ఫుటేజీలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రభుత్వం ప్రోత్సాహంతో, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో, పల్లె, పట్టణాలలో సీసీ. కెమెరాల వాడకం సర్వసాధారణంగా మారింది. కొన్ని చోట్ల దాతల సహకారంతో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.**

*బోనకల్, మహా*

## నిద్రిస్తున్న నిఘానేత్రం

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమంటూ చెప్తుంటారు. కానీ ఇక్కడ ఆ నిఘా నేత్రం నిద్రిస్తున్నది. సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పర్యవేక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.ఫలితంగా మండలంలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్న లేనట్టేనని, నిఘా నేత్రం నిద్రిస్తున్నదని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో సీసీ కెమెరా ప్రాధాన్యత ప్రతి ఒక్కరికి తెలిసిందే. ప్రతి ఇంటి ముందు సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవడంతో పొడలి వద్ద ఏర్పాటు చేసుకుంటున్నారు.

## పెరిగిపోతున్న దొంగతనాలు

ఇటీవల మండలంలోని బోనకల్ గ్రామపంచాయతీలో పట్టపగలే ద్విచక్ర వాహనం అపహరణకు గురైనట్టు సమాచారం. గతంలో వైన్ షాపులో చోరీ, తండాలో ఏసీ చోరీకి గురికావడం,అలాగే కలకోట గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరగడం లాంటివి చోటుచేసుకున్నాయి. స్టేషన్ రావినూతలలో పలుచోట్ల వాహనాలు చోరీకి గురికావడం, నూతన గృహాలు కట్టే స్థలంలో బోర్లో మోటర్లు అపహరణ జరిగింది. అంతేకాకుండా మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయం, స్త్రీ శక్తి భవనం ఇలా ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నిఘా కరువైంది.

## పర్యవేక్షణ లోపం

సీసీ కెమెరాల పని తనం అలంకరణ ప్రాయంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ప్రధాన కేంద్రమైన బోనకల్,రావినూతల,జానకిపురం,పెద్దబీరవల్లి, గోవిందాపురం (ఎల్),కలకోట,గార్లపాడు,తూటికుంట్ల గ్రామపంచాయతీ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ పర్యవేక్షణ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడంతో పలుచోట్ల కెమెరాలు మసకబారుతున్నాయని ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీల పరిధిలో అయితే సీసీ కెమెరాల ఏర్పాటు కూడా లేదనేది గమనార్హం.

## అధికారుల చొరవ ఉంటుందా?

సీసీ కెమెరాలు లేక నిందితులను గుర్తింపు కష్టతరంగా మారడమే నిఘా నేత్రం నిద్రపోతున్నదనడానికి, అధికారుల పర్యవేక్షణ లోపం ఉందనటానికి నిలువెత్తు సాక్ష్యం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనుండగా ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటికైనా అధికారులు మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణ చేపడతారో లేదో వేచి చూడాల్సిందే?

### శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో

# ముమ్మరంగా ప్రతిష్టల ఏర్పాట్లు

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి వితరణలు



**కారేపల్లి, ఫిబ్రవరి11,మహా:** మండల కేంద్రమైన కారేపల్లిలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో మార్చి రెండవ తేదీన శ్రీ గోవింద మాంబ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాలు ఉన్నాయని దేవాలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నామని దేవాలయ కమిటీ నిర్వాహకులు తుమ్మోజు రామమూర్తి, వేములూరి కోటచారి తెలిపారు.మంగళవారం స్వామివారి ప్రతిష్టల సందర్భంగా కార్యక్రమాలు పూర్తిచేసేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి వితరణలు చేస్తున్నారని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు పట్టణానికి చెందిన ప్రధానోపాధ్యాయులు పూసపాటి వెంకట రమణ కుమార్- కళ్యాణి దంపతులు పదివేల రూపాయలు,అలాగే కామేపల్లి మండలం రామకృష్ణాపురానికి చెందిన పిట్టల సైదులు-యశోద దంపతులు పదివేల 16 రూపాయల నగదుతోపాటు ఆవు దూడను దేవాలయం పేరు మీద బహుకరించారు.

**నవగ్రహాల శిల్పాలకు 25000 అందించిన అనంతోజు లక్ష్మణాచారి**

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో స్వామి వారి ప్రతిష్టలతో పాటు నవగ్రహాలను ఏర్పాటు చేసేందుకు నవగ్రహాల శిల్పాలు కొనుగోలు చేసేందుకు కారేపల్లికి చెందిన అనంతరాజు లక్ష్మణాచారి- లక్ష్మీ దంపతుల తోపాటు వారి చిన్న కుమారుడు తిరుమల ఆచార్యులు-శైలజ,గేట్ పోలంపల్లి వాసులు మద్దోజు అశోకాచార్యులు 25 వేల రూపాయల నగదును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహక కమిటీ సభ్యులు తుమ్మోజు రామ్మూర్తి,వేములూరి కోటా చారి,పోలోజు రామాచారి అద్దంకి వీరభద్రాచారి, వాసు,తిరుమలాచారి ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.,

# ఉపాధ్యాయులు విద్యను సులభపద్ధతిలో బోధించాలి

**చర్ల, మహా:** గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు గణిత శాస్త్రం మరియు ఇంగ్లీష్ సబ్జెక్టులలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని వారికి సులభ పద్ధతిలో అర్థమయ్యేలా సంబంధిత లెక్కలకు సంబంధించిన సూత్రాలతో పాటు ఇంగ్లీష్ కూడా అర్థమయ్యే రీతిలో బోధిస్తే పాఠ్యాంశాలు విద్యార్థినిలు సులభంగా అవగతం చేసుకుంటారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం చర్ల మండలంలోని పెద్ద మిడిసిలేరు గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను మరియు తరగతి గదులను, పాఠశాలలోని డైనింగ్ హాల్, డార్మెటరీ, వంటశాలను తనిఖీ చేశారు. అనంతరం ఆరవ తరగతి మరియు ఏడవ తరగతి విద్యార్థినిలతో కలిసి వేదిక్ గణితం నకు సంబంధించిన బోధన తీరును తరగతి గదిలో విద్యార్థినులతో కూర్చొని ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయురాలు బోధించిన అంశాన్ని పిల్లల చేత రాయించి దానిలోని సారాంశాన్ని విద్యార్థినిల చేత అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు గణిత శాస్త్రం బోధించేటప్పుడు వారికి సులభమైన పద్ధతిలో అర్థమయ్యే రీతిలో సూత్రాలలోని సారాంశాలను తెలియజేయడానికే వేదిక్ మ్యాథ్స్ ప్రవేశపెట్టడం జరిగిందని, ముఖ్యంగా టేబుల్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గణిత శాస్త్రం అంటే పిల్లలు భయపడకూడదని, బేసిక్స్ పై ఏ పిల్లలైతే వెనుకబడి ఉన్నారో వారికి ఈ యొక్క వేదిక గణితం ద్వారా భయాన్ని పోగొట్టాలన్నారు. విద్యార్థినిలు తప్పనిసరిగా గణితము ఇంగ్లీష్ పదాలు అర్థం చేసుకోవడమే కాక చదవాలి, రాయగలగాలని అన్నారు. ప్రతిదీ పాఠశాలల్లోనే పిల్లలు అర్థం చేసుకొని నోట్ బుక్ లో రాసుకునే విధంగా చూడాలని కఠినమైన పదాలు ఏమైనా ఉంటే దానికి సంబంధించింది హోంవర్క్ ద్వారా పిల్లలు చేత రాయించుకొని చూడాలని, ఏమాత్రం పొరపాటుగా రాసిన దానికి సంబంధించిన విషయాలు వెంటనే పిల్లలకు తెలియజేయాలన్నారు. విద్యార్థినిలు వేదిక్ మ్యాథ్స్ సంబంధించిన ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా విని అర్థం కాకపోతే మరలా అడిగి తెలుసుకుని గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులపై సందేహాలను నివృత్తి చేసుకొని పూర్తిస్థాయిలో అర్థం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ ఈశ్వర్, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఎం చంద్రకళ మరియు విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కూర్చుని వింటున్న రాహుల్




# ఇంటర్నెట్ వినియోగంపై అప్రమత్తత

- సురక్షితంగా ఉపయోగించేందుకు అవగాహన కీలకం
- సైబర్ మోసాల నుంచి ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా కార్యశాల
- ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలు
- జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మజ

**సూచనలు**

- దృఢమైన పాస్‌వర్డ్‌ల వినియోగం
- అధికారిక వెబ్‌సైట్లు మాత్రమే ఉపయోగించాలి
- సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలి
- వ్యక్తిగత సమాచారం పంచుకునే ముందు
- ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి
- సందేహాస్పద లింకులు, ఈమెయిల్స్‌ను తెరవకుండా ఉండాలి

**ఖమ్మం, ఫిబ్రవరి 11, మహా:** ఇంటర్నెట్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మజ సూచించారు. సోమవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ , ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ప్రాజెక్ట్ ద్వారా ఎన్ఐసీ డాగ్ సంస్థల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై వర్క్‌షాప్ లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఎన్ఐసి జిల్లా కేంద్రం ఆధ్వర్యంలో ఖమ్మంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యెన్ ఐ సి డీఐఓ రాంప్రసాద్, డీఏవో భిక్షు పాల్గొని, సురక్షిత ఇంటర్నెట్ వినియోగ విధానం, సైబర్ నేరగాళ్ల మోసాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి కీలక అంశాలపై వివరణ ఇచ్చారు. ఫిషింగ్, స్పూఫింగ్, మాల్వేర్, రాన్సమ్‌వేర్ దాడులు వంటి కొత్త తరహా మోసాలపై ఉద్యోగులకు, అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యశాలలు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు.

# టాటా మోటార్స్ సరికొత్త మోడళ్ల విడుదల



**ఖమ్మం అర్బన్ , ఫిబ్రవరి 11 , మహా:** టాటా మోటార్స్ ప్యాసింజర్ కార్ విభాగంలో తన విజయవంతమైన మోడళ్లైన టాటా నెక్సన్, టాటా టియాగో వాహనాలను కస్టమర్ల సూచనల మేరకు అప్‌గ్రేడ్ చేసి, మంగళవారం ఖమ్మం మార్కెట్‌లో విడుదల చేశారు. నగరంలోని వెంకటరమణ మోటార్స్ షోరూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జి.లింగస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని వాహనాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జి.లింగస్వామి మాట్లాడుతూ, టాటా మోటార్స్ అన్ని వాహనాలు అత్యున్నత భద్రతా ప్రమాణాలతో రూపొందుతున్నాయి అని, 5-స్టార్ సేఫ్టీ రేటింగ్‌తో వినియోగదారులకు మరింత భద్రత కల్పిస్తున్నాయని తెలిపారు. కస్టమర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, టాటా మోటార్స్ తన వాహనాలను నిరంతరం అప్‌గ్రేడ్ చేస్తూ నూతన ఫీచర్లు, అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమని అన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు తక్కువ వడ్డీ రేటుతో వాహన రుణాలను అందిస్తున్నదని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ మోటార్స్ సేల్స్, సర్వీస్ జనరల్ మేనేజర్లు, సంస్థ ఉద్యోగులు, టాటా మోటార్స్ కస్టమర్లు పాల్గొన్నారు. వాహన సర్వీసింగ్ విషయంలో అధీకృత సెంటర్ల సేవలను వినియోగించుకోవాలని, క్విక్ సర్వీస్ సెంటర్ ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. ఖమ్మం ప్రాంతంలో టాటా మోటార్స్ కొత్త మోడళ్లకు మంచి స్పందన లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

09
FOLLOW: @ANNTELUGU
12-2-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కఠిన చర్యలు

**ఖమ్మం, ఫిబ్రవరి 11,మహా:** ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు. అదనపు డీసీపీలు నరేష్ కుమార్ , ప్రసాద్ రావు తో కలిసి అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ అధికారి సాయినాథ్, భూగర్భ జల శాఖ అసిస్టెంట్ అధికారి రమేష్ ఇతర అధికారులతో మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రాంతాలలోనే రాయల్టీ రుసుము చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని వాగులు, నది పరివాహక ఇసుక తవ్వకాల ప్రాంతాలను గుర్తించి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. చెక్ పోస్టుల ద్వారా ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా వెంటనే చట్ట ప్రకారం జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయడం, వాహనాలను జప్తు చేయాలన్నారు. అధికారులంతా ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మైనింగ్ అధికారులు పోలీసు శాఖ వారి సమన్వయంతో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఆదేశించారు. జీరో



బిల్లులు, డబుల్ ట్రిప్, అదనపు లోడ్, నకిలీ బిల్లులు, తప్పుడు వాహనంలో రవాణా, తప్పుడు గమ్యం స్థానం, అలాంటి ఉల్లంఘన మరియు అక్రమాలపై కేసులు నమోదు చేయాలని అన్నారు. ప్రదాన నిర్వాహకుల పేర్లను తప్పకుండా బయటకు తీసుకురావాలి.

## ఛత్తీస్‌గఢ్‌లో పేలిన ఐఈడీ... జవాన్‌కు తీవ్ర గాయాలు

**చర్ల , ఫిబ్రవరి 11, మహా:** ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ దంతెవాడ జిల్లా జేగుర్గొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో భద్రతా దళాల కూంబింగ్ సమయంలో భద్రతా బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ ఐఈడీ పేలడంతో సీఆర్పీఎఫ్ 231 బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎన్. శుక్లా తీవ్రంగా గాయపడ్డారు. 231 సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లోని 'ఎఫ్' కంపెనీ కమల్‌పోస్ట్ క్యాంప్ నుండి కూంబింగ్‌కు వెళ్లిన జవాన్లు తిరిగి వస్తుండగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలింది. భద్రతా దళాలకు గాయాలు కలిగించేందుకు ఉద్దేశించిన ఈ పేలుడులో హెడ్ కానిస్టేబుల్ శుక్లా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన జవాన్‌కు ప్రాథమిక చికిత్స అందించిన భద్రతా దళాలు, మెరుగైన చికిత్స కోసం అతడిని హెలికాప్టర్ ద్వారా రాయపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శుక్లా పరిస్థితిని గమనిస్తున్నట్లు సమాచారం. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతమైన దంతెవాడ జిల్లాలో భద్రతా దళాల కూంబింగ్ ఆపరేషన్‌లపై విఘాతం కలిగించేందుకు మావోయిస్టులు ఐఈడీలు అమర్చడం ఇదేమీ కొత్త కాదు. భద్రతా దళాలు మావోయిస్టుల కదలికలను గమనిస్తూ సుదీర్ఘ కాలంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.




## అక్రమ కేసులతో భయపెట్టలేరు

**ఖమ్మం సిటి, ఫిబ్రవరి 11, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ నాయకుడు, డిసిసిబి డైరెక్టర్ లక్కినేని సురేందర్‌ను అక్రమ కేసులతో టార్గెట్ చేయడం కాంగ్రెస్ కుట్రలో భాగమని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్ విమర్శించారు. ఇల్లందు ఎమ్మెల్యే డైరెక్షన్‌లో లక్కినేని సురేందర్‌పై అక్రమంగా కేసులు మోపి, ఖమ్మం సబ్ జైలుకు పంపిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మం సబ్ జైలుకు వెళ్లి లక్కినేని సురేందర్‌ను పరామర్శించిన తాతా మధు, ఆయనకు బిఆర్ఎస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి



**ఖమ్మం, ఫిబ్రవరి 11, మహా:** మిర్చి బోర్డును ఏర్పాటు చేసి మిర్చి ధరను స్థిరీకరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల ధరలను స్థిరీకరించకపోవడం వల్లే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి ధరలు పతనమై రైతులు తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయని తద్వారా వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు రైతు వద్ద ఉన్నప్పుడు ఒక ధర రైతు చేయి దాటగానే వ్యవసాయ ఉత్పత్తులకు ఎలా రెక్కలు వస్తున్నాయని హేమంతరావు ప్రశ్నించారు. రైతు వద్ద ఉన్నప్పుడు లేని ధర రైతు చేయి మారగానే ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. మిర్చి ధరకు సంబంధించి తక్షణం మిర్చి బోర్డును ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి ధర కోసం త్వరలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని ఈ సందర్భంగా హేమంతరావు తెలిపారు.

## పండిట్ దీనదయాళ్ జీవితం నేటి తరంకు ఆదర్శం



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 11 మహా:** పండిట్ దీనదయాళ్ జీవితం నేటి తరం కు ఆదర్శమని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పండిట్ దీనదయాళ్ వర్ధంతి ని నిర్వహించారు. ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...బీజేపీ పార్టీ పటిష్టతకు పునాదులు వేసి అంత్యోదయ ఏకాత్మా మానవతా సిద్ధాంత రూపకర్త స్ఫూర్తి దాత అన్నారు. ఆధ్యాత్మిక దృష్టితో మానవ సేవ చేయటమే సరైన జీవిత విధానమని పేర్కొన్నారు. ఏకకాల సమగ్ర కార్యక్రమాన్ని సూచించే సమగ్ర మానవతావాదం అనే రాజకీయ తత్వాన్ని దీన ధయాళ్ ఉపాధ్యాయ రూపొందించారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్ష, అల్లు కృష్ణారావు, కందరబోయిన గోపి, తుపాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల వెలుగు విద్యార్థులకు నోట్స్, పెన్నులు పంపిణీ



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 11 మహా:** మండల కేంద్రం కు చెందిన సీపీఎం పట్టణ కమిటి కార్యదర్శి మందడపు మురలీకృష్ణ కుమార్తె సాయి నర్మదా పుట్టిన రోజు ను సందర్భంగా స్థానిక బాలవెలుగు విద్యాలయం పిల్లలకు నోట్స్, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక బాలవెలుగు విద్యాలయం లో పుట్టిన రోజు ను జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు కొత్తా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంగాపురం మేజర్ లష్కర్ గుండెపోటుతో మృతి



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 11 మహా:** మండలం లోని నీటిపారుదల శాఖ లో పని చేస్తున్న లష్కర్ బాణోత్ భద్రు (55) గుండెపోటు తో మంగళవారం మృతి చెందాడు. నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా కు చెందిన భద్రు చాలా కాలం వరకు స్థానిక గ్రామ రెవిన్యూ సహాయకులు (వీఆర్ఎ) గా పని చేశారు. గత రెండేళ్ల క్రితం ఇరిగేషన్ శాఖలో లష్కర్ గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మంగాపురం మేజర్ కాలువ పరిధిలో లష్కర్ గా పని చేస్తున్నారు. మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు కు భార్య, ఇరువురు కుమారులు. కుమార్తెలు ఉన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు అంత్యక్రియలకు ఖర్చులకు రూ.7 వేల ను అందించారు. మృతదేహం ను పలువురు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు.

## బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

**కారేపల్లి, ఫిబ్రవరి11,మహా:** గ్రామంలో పేద కుటుంబంలో ఏ సమస్య వచ్చినా మేమున్నామంటూ భరోసా కల్పించి అండగా ఉంటున్న గ్రామ యువ నాయకులకు పలువురు అభినందిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో అనేక పేద కుటుంబాలకు చేయూతనందించి గ్రామస్థుల మన్ననలు పొందుతున్నారు. కారేపల్లి మండల పరిధిలోని వెంకటియ్య తండ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ భూక్య విజయ ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. గ్రామ యువ నాయకులు ఆనవైతిగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం మృతురాలి కుటుంబానికి బియ్యం వితరణగా అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ భగవాన్ లాల్, బానోత్ బాలు , గుగులోత్ బాబులాల్, బానోత్ భాస్కర్ నాయక్, మాలోత్ శోభన్ బాబు నాయక్, జర్పుల జగన్ నాయక్, ఇస్లావత్ కృష్ణ నాయక్, బానోత్ ప్రేమ్ కుమార్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

